# “ఊరి ముత్తైదువ మిద్దె భూమక్క....”

భూమక్క వాడకున్నోల్లకెవ్వలకు గూనిల్లు లేనప్పుడు ఆమెకు గూనిల్లుండెనట. గందుకే ఆమెను మిద్దె భూమక్కంటరు. ఆమెకు అవ్వయ్యల్లెవ్వలు లేరు. అక్కసెల్లెంద్రన్నదమ్ముల్లేరు. మొగుడు పిల్లలసలే లేరు. నా అనెటోల్లెవ్వల్లేరు భూమక్కకు. అయితె ఊరంత సుట్టాలె భూమక్కకు. ఊరందరికి సుట్టమే భూమక్క. ఊరందకికి తలల నాలికోలె పనిజేత్తది భూమక్క. గిప్పుడు ముసల్దైంది భూమక్క.

“మంచిగున్నావు బిడ్డెల్లార....మొన్న నాయిన్నకు జెరమచ్చెగద తక్కో అయిందా? ఇప్పుడు పానం బాగుందా?” అని బాగలేనోల్లింటికి పొయ్యి మాట్లాడిత్తది. బాగు సూత్తది.

“పొల్లందీసుక పోతలేడట గద లేకిడోడు. అన్ని ఫెద్దమనుషులల్ల పెట్టి నల్లమొకం సెయ్యకపెయినావు........” అని ఇంటిమీదున్న ఆడిపిల్లం గురించాల్లతోని సెప్పుద్ది.

“దావకాండ్ల మొన్నట్రాకున్నవట గాదె. బాగనే పైస కర్సయిందనుకుంట. కొంచెం మంచిగ మెదులు బిడ్డ. అప్పులు సప్పులు సెయ్యకు.......”

“కొడుక్కు నౌకరయిందార తమ్మి. ఎవ్వలనన్న పట్టి నౌకరిసేయించకపెయినవా? లంచంబెట్టందయితాది?” అని ఒగలతోనంటది.

“గట్లనేనార గాడిదికొడుక....! గా ఆడిపోరిమీన సెయ్యిజేసుకుంటావుర. గదాన్ని గొడితెనే మొగోనివైనవా ఇగ? పెండ్లాం మొగలు సిలుక గోరింకలోలె కల్సుండాలె కని ఊకె కొట్లాడుతార్ర! మంచోనివే ఉన్నవు” అని మందలిచ్చత్తది.

“నీకేమన్న తలుకాయున్నాదె బరిదెగిందాన. మొగోంది మోటుబుద్ధి. ఆడు కొంచెం గరంగ మాట్లాడినప్పుడు- కొంచెమంతోపిక పడితేందే? మాటకు మాటనుకుంటాని మీదికి లేత్తాడు గొట్టడా? కొట్లాడక సంచురంగ సంసారం సేసుకునుడు నేర్చుకోండ్రి. ఎవ్వల సంసారం జూసినా పూసిన తంగేడోలుంది. నీదేమొ గిట్ల కాలిపెయిందేమె?” అని మొగంతోని కొట్లాట పెట్టుకునే ఆడామెతోనంటది.

గిట్ల ఇంటింటికి తిరిగి మాట్లాడివత్తది. అవుసరమయితె అల్లింట్ల పనిజేత్తది. ఎవ్వలకన్న

మంచిగ లేకుంటె అల్లతోని దావకానకు పోతది. అందర్ని తనకు సొతనయినట్టరుసుకుంటది.

ఊళ్లె లగ్గాలు గిట్టయితె ఆమెకు ఇరామే[52] ఉండది. అందరామెనే పిలుత్తరు. ఇండ్లల్లకు సొచ్చుకోనిపోయి పన్జేత్తది. పాన్పులేసినకాడ గొంతెత్తి పాటలు పాడుతది. కాల్లగోల్ల పాటలు గూడ పాడుతది. కాల్లగోల్లప్పడాలు మొగలతోని మస్తు పరాశికాలు మాట్లాడ్తది. అల్లు సిగ్గు పడ్డాగని సిగ్గుపొయ్యేటట్టు సేత్తది. ఇద్దర్ని అర్రల పడగొట్టి తలుపులేత్తది. పొల్లకేమొ 'బయపడకు బిడ్డా' అని దైర్యం సెప్పుతది.పిలగాంతోనేమొ 'పోర్ని బెదురగొట్టకు. మెల్లెమెల్లెగ దగ్గెరికి తీసుకో. నుచ్చకొట్టి[53] రేవుకు దెచ్చుకో. మొదాలే బయపెట్టిత్తె అదిగ నీ దగ్గెరికే రాదు' అని బుద్దిమాటలు సెప్పుతది.

గిట్ల ఊరోల్లందరికి తలల నాలికోలుండె భూమక్కను ఊరికే పెద్దముత్తైదువంటరు ఊరోల్లు. అయితె గా భూమక్క పెనిమిటి గురించి మాత్తురం తలోతీరు గనుకుంటరు. ఆమెకు లగ్గమే కాలేదని ఒగలంటె, అయింది కని మొగడిడిసిపెట్టిండని ఇంకొగలంటె, ఆమే మొగన్నిడిసిపెట్టిందని మరొగలంటరు. ఓ పారోగామె భూమక్కనే అడుగుతె సెప్పంగిన్న.

"అని నోట్లె సాడు. గాంజోలెందకు తియ్యి బిడ్డ. సిన్నప్పుడే నన్ను మోసం జేసెల్లిపెయిండాడు. మా అవ్వయ్యలు గూడ నేనేలెడంతున్నప్పుడే సచ్చిపెయింగ్రు. ఇగ నేను మిగిల్న" అంది.

ఊరికే సుట్టం భూమక్క మాత్తురం బతికేది కయికిలి సేసుకుంటనే. పొద్దుగాల్లేసిందంటె బుక్కెడంతుడుకవెట్టుకోని దవ్వదవ్వ పన్జేసుకోని తిని కయికిలికి పోతది. మల్ల పొద్దు గూకింటికత్తేనే తింటది. ఊరోల్లందరికి సాయం జేత్తదిగదాని ఎవ్వలన్న బువ్వ తినుమన్నా తినది. పండుగలప్పుడు మాత్రం వద్దన్నా వినక కొంతమంది గారెలు, సకినాలు, అరిసెలు వండిన బొక్కకూర గిట్ల తలోటిదెచ్చి బూమక్కకిచ్చిపోతరు.

మొద్దు కట్టంతోని బతుకుక్కుంట మోటుదానోలుండె బూమక్క కంటం కోకిల కంటమే. ఆమె పాట పాడిందంటె నవరసాలు కురిపిత్తతది.......నవ్విత్తది.....కంట నీరు పెట్టిత్తది. ఎట్ల నేర్సుకుందో కని మస్తు పాటలు నేర్సుకుంది. అవ్వన్ని వేయిలల్లకెక్కుతె వెయిల పేజీలైతయి. ఆమె అన్ని తీర్లపాటలు రాగాల్దీసుకుంట పాడుతది. వానగొట్టుడాల్చెమైతే ఊరోల్లందరామెతోని వానదేవుని ఉయ్యాలపాట పాడిపిత్తరు. బతుకమ్మ పండుగచ్చిందంటిగ వశెంగాని పాటలు పాడుతది. పెద్ద సెరిసగం నాత్తిరిదాక పాటలే పాటలు. సారంగధరుని కత, గంగదేవికథ, ఇద్దరక్కసెల్లెండ్లకథ, కాటమరాజు కథ, సిరియాలుని కథ, గిట్ల ఇంకెన్నో పెద్దపెద్ద కథలు ఉయ్యాల పాటలోలె పాడుతది.

సదువు ముక్క గూడ రాని భూమక్క గిన్ని పాటలెట్ల గంత మంచిగ పాడుతదో అని నేను సిన్నప్పట్నుంచి ఆశ్చెర్యపోతన్న. బతుకమ్మ పండుగకు ముంగట పదిగేనురోజుల్నుంచి అయిపెయినంక

పదిగేను రోజుల్దాక ఇడువకుంట పాడుతనే ఉంటది. గందుకే భూమక్కను ఉయ్యాలపాటల భూమక్కని గూడ పిలుత్తరు. నేను గల్సినప్పుడల్ల "మంచిగున్నావుర బిడ్డ? సిన్నది మంచిగుందా? కొడుకు. బిడ్డెలు మంచిగున్నరా? సల్లగ బతుకుండ్రి బిడ్డలార" అని దీవిత్తది.

ఓపారి మా నాయిన్న దగ్గెరికచ్చి కండ్లపొంటి నీల్లు దీసుకుంట సెప్పుంగిన్న.

"సూడ్రా తమ్మి! ఏం జెయ్యాలెర ఓదన్న. నాకు గిన్ని పాటలచ్చె. ఒక్క నా సంవితన్న నేర్సుకొమ్మంటె నేర్సుకుంటలేపాయె. నేంజత్తె ఇగ గీ పాటలన్ని నాతోనే పోతాయిర. గిప్పటి పోరక్కతన్న గివ్వి నేర్సుకుంటె బాగుండు. ఇగ నేనెన్ని దినాలు బతుకుత. నాతోని గివ్వి నాశినెమయినట్టే" అంది.

"నువ్వు కుక్కిలవడితెట్లున్నది సూసుకోవాలె గని గా పాటలెట్లన్న రందున్నాదె నీకు? గవ్వి పోతె పోయె తియ్యలేవు....." అన్నడు మా నాయిన్న.

"కుక్కిల వడితెవ్వతన్న నా ఇల్లు తీసుకొనదే సాత్తదేంది? లేకుంటె మెల్లెమెల్లెగ బొర్లుకుంట పొయ్యి నూతిలవడితయిపాయె. పుట్టినంకెనుకోముందో అందరు సచ్చుడేనాయె. గదానికి నాకేం రంది లేదు. కని ఒక్కతన్న గీ పాటలు నేర్సుకోకపాయెననే రంది?" అని కండ్లనీల్లు దీసుకుంటెల్లిపోయింది భూమక్క.

భూమక్క గా మాటలు యాదికత్తె గండ్లున్న ఆవేదన మనుసుకు తలిగి కలుక్కుమంటది నాకు. భూమక్కే కాక గసొంటి ఎంతోమంది జానపద కళాకారుల పాటలు, కళలు ఆల్లతోనే అంతరించుడు, బాద కలిగిత్తది. కొన్ని కొన్ని అసొంటియి పుస్తకాలకెక్కుతున్నా అన్ని పుస్తకాలకెక్తె మంచిగుండునన్న ఆశ కలుగతది నాకు. యూనివర్సిటీలు గీ పంజేత్తె ఎంతో విలువైన సంపద మనకు దక్కుద్ది గద!

ఇంకొన్నేండ్లకు గీ పాటలు పాడెటోల్లు దొరుకుడు కట్టమేనన్నది ఆలోసిత్తె నా మనుసంత బరువైతది.

★★★